**Sakshi**

# తొలుత ప్రొఫెసర్, అసోసియేట్ల నియామకాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు స్క్రీనింగ్‌టెస్టు
- అసోసియేట్, అసిస్టెంట్ పోస్టులకు రోస్టర్ విధానం
- విధివిధానాలపై ఉన్నత విద్యామండలి కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 14 వర్సిటీల్లో పోస్టుల భర్తీకి సంబంధించి విధివిధానాలపై ఉన్నత విద్యామండలి దృష్టి సారించింది. మొత్తం 14 వర్సిటీల్లో 1,385 ఖాళీలకుగానూ తొలిదశలో 1,104, మలిదశలో 281 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ పోస్టుల భర్తీకి రాష్ట్రస్థాయిలో స్క్రీనింగ్ టెస్టు నిర్వహించనున్నారు. 1,385 పోస్టుల్లో 90 ప్రొఫెసర్, 168 అసోసియేట్ ప్రొఫెసర్, 846 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులున్నాయి. ఇందులో ప్రొఫెసర్, అసోసియేట్ పోస్టులను ముందుగా భర్తీ చేయనున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించనున్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం అకడమిక్ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ పాయింట్లు, ఇంటర్వ్యూలు, పదోన్నతుల ద్వారా ఆయా వర్సిటీలే వీటిని భర్తీ చేయనున్నాయి. పదోన్నతుల ద్వారా భర్తీ అయ్యే ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు వంద మార్కుల మేర ప్రతిభా పాయింట్లను ప్రామాణికంగా తీసుకోనున్నారు. ఏపీఐకి 50 పాయింట్లు, పరిశోధన, పబ్లికేషన్లు తదితరాలకు30, ఇంటర్వ్యూకి 20 పాయింట్లు ఉంటాయి. వీటికి స్క్రీనింగ్ టెస్టు ఉండదు. పీహెచ్‌డీతో పాటు ప్రొఫెసర్ పోస్టులను కోరుకొనే వారికి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదేళ్ల సర్వీసుండాలి. అదే అసోసియేట్ ప్రొఫెసర్లు కాగోరే అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. బోధనతో పాటు, ఏదైనా ఇండస్ట్రీలో ఈ అనుభవమున్న వారు ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా అర్హులు. అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను రోస్టర్ విధానంలో భర్తీచేస్తారు.

### అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు స్క్రీనింగ్ టెస్టు

అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాష్ట్రస్థాయిలో స్క్రీనింగ్ టెస్టును నిర్వహించనున్నారు. ఆబ్జెక్టివ్ విధానంలో మూడు గంటలపాటు పరీక్ష ఉంటుంది. ఆంధ్రా, ఎస్వీయూ, శ్రీకృష్ణదేవరాయ, నాగార్జున యూనివర్సిటీలకు ఈ బాధ్యతలు అప్పగించే అవకాశముంది. స్క్రీనింగ్ టెస్టులో అర్హత మార్కులు సాధించిన వారిని ఆయా యూనివర్సిటీల వారీగా పోస్టుల భర్తీకి అర్హత కల్పిస్తారు. అయితే అసిస్టెంట్ పోస్టులను రోస్టర్ విధానంలో రిజర్వేషన్ల ప్రకారం భర్తీచేయాల్సి ఉంటుంది కనుక స్క్రీనింగ్ టెస్టులో అర్హత మార్కులను అందరికీ ఒకే మాదిరిగా కాకుండా రిజర్వేషన్లను అనుసరించి ఆయావర్గాలకు వేర్వేరు అర్హత మార్కులను నిర్ణయించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, వికలాంగులు ఇలా ఆయా వర్గాలకు అర్హతమార్కులు నిర్దేశించాల్సి ఉంటుందని భావిస్తున్నారు. స్క్రీనింగ్ టెస్టుతో నాణ్యతపరంగా కొన్ని ఇబ్బందులొస్తాయని చెబుతున్నారు.